




'గురుకులం'లో కలెక్టర్ తనిఖీ

నెల్లూరు :నగరంలోని దర్గామిట్ట వద్దనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను శనివారం జిల్లా కలెక్టర్ ఆనంద్ తనిఖీ చేశారు. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న భోజనం మెనూ వివరాలు, వసతి సౌకర్యాలను హెచ్‌ఎం విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు.సిబ్బంది హాజరు పట్టిక, పలు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్, విద్యార్థుల నివాస గదులు, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. ఆరో తరగతి, పదోతరగతి విద్యార్థులతో మమేకమైన కలెక్టర్, వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు కషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. రోజువారి సిలబస్ తో పాటు విద్యార్థులకు కనీస విషయ పరిజ్ఞానం ఉండేలా ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పరిమళ ఉన్నారు.



కలిసి పనిచేద్దాం.. సహకరించండి..!

వైసిపి ప్రజాప్రతినిధులకు మంత్రి విజ్ఞప్తి - సాదాసీదాగా జెడ్‌పి సమావేశం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

" గతంలో ఏం జరిగిందో వదిలేద్దాం.. .ఐదేళ్లల్లో అభివృద్ధి జరగలేదు. తమ ప్రభుత్వం ప్రజలకు ఏదో చేయాలని ప్రయత్నం చేస్తుంది, అందరూ సహకరిం చండి, కలిసి పనిచేద్దాం సహకరించండి " అంటూ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా సమావేశం నిర్వహిం చారు. చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షత వహించారు. కలెక్టర్ ఒ. ఆనంద్, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శాసన మండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, డివి కృష్ణా రెడ్డి, కె.రామకష్ణ, ఇంటూరి నాగేశ్వర రావు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సమావేశంనుద్దేశించి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ సమావేశాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవతో పాల్గొనాలని, వారి ప్రాంత సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ఇంకా రెండున్నరేళ్ల పదవీకాలం సమయముందని, దానిని సద్వినియోగం చేసుకొని ప్రజలకు మంచి పరిపాలన అందించాలన్నారు. మండల పరిషత్ సమావేశాల్లో ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. మండల, గ్రామ స్థాయిల్లో జరిగే సమావేశాల ద్వారా సాంకేతికత బదిలీ జరుగుతుందన్నారు. జిల్లాలో 85శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, అటువంటి రైతుల సమస్యలపై జెడ్‌పి సమావేశాల్లో ఎలుగెత్తి చాటాల్సిన అవసరం సభ్యులపై ఉందన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో జిల్లా లోని సాగునీటి ప్రాజెక్టులకు గ్రహణం పట్టిందని, చిన్నచిన్న రిపేర్లకు సైతం నోచుకోకుండా పూర్తిస్థాయిలో నిర్వహణ కొరవడిందన్నారు. అనేక విధాలుగా రైతాంగం నష్టపోయిందన్నారు. అదేవిధంగా జిల్లాలోని సోమశిల, కండలేరు ప్రాజెక్టుల ఆయకట్టును స్థిరీకరిస్తామన్నారు. సోమేశ్వరాల యాన్ని దేవాదాయ శాఖ నిధులతో పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం అనుభవమున్న ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినందున, వ్యవసాయపరంగా రైతులకు అన్ని విధాలుగా మేలుచేసి ఆదుకుంటామన్నారు. కేవలం రవాణా ఖర్చులు వసూలు చేస్తూ, ఇసుకను పూర్తి ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఇసుక ద్వారా వచ్చిన కొద్ది మొత్తాన్ని స్థానిక సంస్థలకే జమ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సభ్యులు లేవనెత్తినట్లుగా బుచ్చిరెడ్డిపాలెం లోని దేవాలయ భూముల్లో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహిస్తామన్నారు. జెడ్‌పి సభ్యులందరూ శాసన సభ్యులతో కలసికట్టుగా పనిచేసి తమ తమ ప్రాంతాల అభివృద్ధికి దోహదప డాలన్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణా భివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత నిస్తున్నా న్నారు. జిల్లాలో ఎటువంటి విత్తనాలు, యూరియా కొరత లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసు కుంటామని, అదేవిధంగా పంట చేతికొచ్చాక అమ్ముకునే ందుకుసరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న జిల్లాకు సంబంధించిన సమస్యలను పరిష్క రించుటకు తన వంతు సహకారం అందిస్తా మన్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇరిగేషన్ పరంగా సాగు చేస్తున్న పంటల లెక్కలకు, ఈ క్రాప్ లో నమోదు చేస్తున్న పంటల లెక్కలకు వ్యత్యాసముందన్నారు. భూసార పరీక్షలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులకు సంబంధించి గతంలో చేపట్టిన మోసపూరిత చర్యలు వల్ల చిన్న, సన్నకారు రైతులు నష్టపోయారన్నారు. నూతన ప్రభుత్వ ఏర్పాటు తరువాత నిర్వహించిన తొలిసమావేశం సాదాసీదాగా జరిగింది.



జెడ్ సమావేశంలో మాట్లాడుతోన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పక్కన మంత్రి పి. నారాయణ, జెడ్‌పి చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

రాష్ట్రంలో గాడితప్పిన విద్యా విధానం

- ◆ప్రత్యామ్నాయం రూపొందించాలి
- ◆మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం
- ◆ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-నెల్లూరు : రాష్ట్రంలో ప్రస్తుతం విద్యావిధానం గాడి తప్పిందని, ప్రత్యామ్నాయ విద్యావిధానం రూపొందించి సమాజం ముందుపెట్టి దానిని సాధించేందుకు ఉద్యమం చేయాలని ఉపాధ్యాయులకు మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శనివారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో స్వర్ణోత్సవ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవానికి ముందుగా ఉపాధ్యాయులు గాంధీబొమ్మ సెంటర్ నుంచి అన్నమయ్య సర్కిల్‌లోని యుటిఎఫ్‌జిల్లా కార్యాలయం వరకు స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యుటిఎఫ్ జెండాను ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరిం చారు. అనంతరం అక్కడ జరిగిన సభలో బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు. 50 ఏళ్ల చరిత్ర కలిగిన ఉపాధ్యాయ సంఘంలో తాను పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో యుటిఎఫ్ ఒక పెద్ద ఉపాధ్యాయ సంఘంగా గుర్తింపు పొందిందన్నారు. విద్యారంగం అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎన్నో ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. యూటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.నరసింహారావు మాట్లాడుతూ 1974 ఆగస్టు 10వ తేదీన యుటిఎఫ్ చారిత్రాత్మక అవసరంగా ఏర్పడిందన్నారు. తెలుగు ప్రజల సమైక్యత, నాటి అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా యుటిఎఫ్ ఏర్పడిందని గుర్తు చేశారు. ఎమ్మెల్సీని సైతం తట్టుకొని నిలబడిన ఏకైక ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ అన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి.చలపతి శర్మ మాట్లాడుతూ జిల్లాలో 9 ప్రాంతీయ కేంద్రాల్లో, అన్ని మండలాల్లో యుటిఎఫ్ ఆవిర్భావోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నగరంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో యుటిఎఫ్ సభ్యులు 6500 మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. యుటిఎఫ్ అధ్యక్షులు వి.వి. శేషులు మాట్లాడుతూ కరోనా సమయంలో యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శులు కె.వరదారామయ్య, సిహెచ్ శ్రీహరి, జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్‌వి.సుబ్బారావు, మాజీ జిల్లా సహాధ్యక్షులు జెడ్డా వెంకయ్య, డి.గోపాల్, సీనియర్ నాయకులు ఎం.వి. చలపతి, రసూల్, జిల్లా సహాధ్యక్షులు ఎం.సి అచ్చయ్య, కోశాధికారి ఎ.మురళీధరరావు, జిల్లా కార్యదర్శులు ఎస్.సురేంద్రబాబు, ఈ బాలగాయ్య, జి.దయాకర్ ఉన్నారు.

కుటుంబ కలహాలతో దంపతులు మృతి

ప్రజాశక్తి-నెల్లూరు :కుటుంబ సమస్యల కారణంగా యువ దంపతులు మృతి చెందారు. ఈసంఘటన నెల్లూరు 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ రింగ్ రోడ్డు ప్రాంతంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు..రింగ్‌రోడ్డు లో నివాసం ఉంటున్న కాకర్ల నాగరాజు(23) సురేఖ(21) మూడు సంవత్సరాల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుని సంతోషంగానే కాలం గడుపుతున్నారు.వారికి ఇద్దరు కుమారులు. ఒకరికి మూడు సంవత్సరాలు, ఇంకొకరికి రెండు సంవత్సరం జరుగుతుంది. కుటుంబ సమస్యల కారణంగా భర్త లేని సమయంలో ఉదయం అమ్మాయి ఉరి వేసుకుని ఉన్నట్లు స్థానికులు గమనించి తల్లిదండ్రులకు సమాచారం తెలపడంతో హడావుడిగా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు అమ్మాయి చనిపోయినట్లు నిర్ధారణ చేశారు. విషయం తెలుసుకున్న భర్త ఆస్పత్రిలో ఉన్న భార్యను చూసి తీవ్రమైన మనోవేదనకు గురై మధ్యాహ్నం సమయంలో విజయమహల్ గేటు సర్కిల్లో రైల్వే ట్రాక్ పై ఎదురుగా వస్తున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు పోస్టుమార్టం చేసి కేసు విచారణ చేస్తున్నారు.



నాగరాజు, సురేఖ దంపతులు (ఫైల్)

పోలీస్‌స్టేషన్లలో ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు :ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రప్రథమంగా జిల్లా పరిధిలోని కొన్ని పోలీస్‌స్టేషన్లలో ఎస్‌పి జి.కృష్ణకాంత్ తనిఖీ చేశారు. శనివారం ఆయన నగరంలోని దర్గామిట్ట, వేదాయపాలెం, వెంకటాచలంస్టేషను, మనుబోలు, కె.పి పోర్టు, ముత్తుకూరు పోలీసు స్టేషన్ లను సందర్శించారు. పోలీసు స్టేషన్ పరిసరాలను, పోలీసు స్టేషన్ మ్యాప్, చార్ట్ లను, స్టేషన్ పరిధిలో ఉన్న హైవే, నేర, శాంతి భద్రతల పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలను పచ్చదనం పెంచాలని, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నగర డిఎస్‌పి శ్రీనివాసులరెడ్డి, రూరల్ డిఎస్‌పి శ్రీనివాసరావు, ఎస్‌బి డిఎస్‌పి శీనివాసరావు ఉన్నారు.

రైతు సమస్యలపై గళం విప్పిన 'ఇంటూరి'

ప్రజాశక్తి-కందుకూరు :నెల్లూరులో శనివారం జరిగిన జిల్లాపరిషత్ సమావేశంలో ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతు సమస్యలను ప్రస్తావించారు. రాళ్లపాడు రిజర్వాయర్ కెపాసిటీ 1.5 టీఎంసీలు కాగా పూడికవల్ల 1 టీఎంసీ నీరు మాత్రమే నిల్వకు అవకాశం ఉందని, అయులో అర టీఎంసీ నీరు త్రాగునీటికి సరిపోతుందని, మిగిలిన అర టీఎంసీ నీటితో 16 వేల ఎకరాలలో పంటలను తడవాల్సి ఉంటున్నారు. సాగునీరు లేక రైతులు ఇబ్బం దులు పడుతు న్నారన్నారు. కొండపనాయుడు ఛానల్ పనులు అసంపూర్తిగా నిలిచి పోవడం వల్ల సోమశిల నుంచి రాళ్లపాడుకు నీరు సక్రమంగా అందడం లేదన్నారు. కాంట్రాక్టర్ కేవలం మట్టి పనులు చేసి వదిలేశారని తెలిపారు. కెనాల్ పనులు త్వరగా పూర్తిచేసి రాళ్లపాడు ఆయకట్టుదారులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఎంఎల్ఎ ఇంటూరి ప్రస్థావించిన అంశాలపై మంత్రి ఆనం రావ ూనారాయణ రెడ్డి స్పందించారు. రైతు ప్రయోజనాలను దష్టిలో ఉంచుకుని అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పి. నారాయణ, కలెక్టర్ ఓ. ఆనంద్, శాసనసభ్యులు పాల్గొన్నారు.



జెడ్‌పి సమావేశంలో 'ఇంటూరి'

కార్యకర్తలతో 'బుర్రా' సమావేశం

ప్రజాశక్తి-కందుకూరు : మాజీ ఎంఎల్‌ఎ, కందుకూరు వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ శనివారం పార్టీ కార్యాలయంలో వివిధ మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. పలు సమస్యలను నాయ కులు, కార్యకర్తలు బుర్రా దృష్టికి తీసుకొచ్చారు. పరిష్కారం కోసం అధికారులతో బుర్రా మాట్లాడారు.



కార్యకర్తలతో సమావేశమైన బుర్రా

'సోమశిల' పనులు చేపట్టాలి

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి - సమీక్షలో మంత్రి 'ఆనం'

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి :సోమశిల జలాశయం అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. జెడ్‌పి సమావేశ మందిరంలో ఇరిగేషన్ అధికారులతో మంత్రి నారాయణతో కలిసి శనివారం సమీక్ష నిర్వంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోమశిల జలాశయం రక్షణ కోసం చేపడుతున్న పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచిం చారు. ప్రధానంగా గేట్ల రోప్స్, హెడ్‌రెగ్యులేటరీ పనుల మంజూరుకు సంబంధించి మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నారాయణ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్, ఆర్థికశాఖ కార్యదర్శులతో ప్రత్యేకంగా ఫోన్‌లో మాట్లాడి త్వరగా అనుమతులు ఇప్పించాలని కోరారు. సోమశిలకు నీళ్ల వచ్చేలోగా అప్రాన్ పనులు పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టి కాంట్రాక్టర్ చేత పనులు వేగం చేయించాలని సూచించారు. సోమశిల అభివృద్ధి పనులకు సరిపడ ఇసుకను ముందుగానే సిద్ధం చేసుకుని స్టాక్ పాయింట్‌లో అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. 18వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం కాగా, ఇందుకు కలెక్టర్ అనుమతి కూడా ఇచ్చారని, ఈమేరకు ఇసుకను సోమశిలకు తరలించి స్టాక్‌పాయింట్‌లో సిద్ధం చేసుకోవాలన్నారు. పంటకాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు మొదలుపెట్టి రైతాంగానికి సాఫీగా సాగునీరం దించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇంకా ఏమైనా మిగిలిన పనులను కూడా గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నెలరోజుల లక్ష్యం పెట్టుకుని పూడికతీత పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈసారి జిల్లా రైతాంగానికి పుష్కలంగా సాగునీరు అందించేందుకు పక్కాగా నీటి పంపిణీ వ్యవస్థను పక్కాగా అమలుచేయాలని అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ గతంలో పెన్నానదికి ఐదులక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చిందన్నారు. ఆ సమయంలో చాలాచోట్ల పెన్నానది కట్టలు దెబ్బతిన్నాయని, వాటిని గుర్తించి కట్టలను ఇసుక బస్తాలు, ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పూడ్చాలని అధికారులను ఆదేశించారు. నెలరోజుల్లోగా పెన్నానది కట్టకు పడిన గండ్లు పూడ్చాలని సూచించారు. కలెక్టర్ ఒ. ఆనంద్, కావలి, కందుకూరు, వెంకటగిరి ఎంఎల్ఏలు కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కురుగొండ్ల రామకృష్ణ, సోమశిల, కండలేరు జలాశయాలు, ఇరిగేషన్ ఎస్ఇలు ఎం.వి.రమణారెడ్డి, బి.వి. రమణా రెడ్డి, కృష్ణమోహన్, డిప్యూటీ కలెక్టర్లు ప్రేమ్‌కుమార్, చిన్నఓబులేసు, డిఎఫ్‌వో చంద్రశేఖర్, ఆత్మకూరు ఆర్‌డిఒ మధులత, తదితరులు పాల్గొన్నారు.



ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు రామనారాయణరెడ్డి, పి. నారాయణ



మాట్లాడుతున్న వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్

హామీలను అమలు చేయాలి

నెల్లూరు :ఎన్నికల సమయంలో టిడిపి కూటమి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి ఆంధ్రప్రదేశ్ వడ్డెర వత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శనివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వడ్డెర వత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఎపి వడ్డెర వృత్తిదారుల సంఘం నాయకులు చల్లా వెంకటయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో వడ్డెర వత్తిదాదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో టిడిపి కూటమి అధికారంలోకి వస్తే బీసీలకు రక్షణ చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. బిసిలలో బాగా వెనుకబడిన వారు వడ్డెరులేనన్నారు. చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య పాల్గొని మాట్లాడుతూ తక్షణమే సమగ్రమైన కులగణన ను జరపాలని ఏ కుల సామాజిక వర్గంలో ఎంతమంది ఉన్నారో తేల్చాలని కేంద్ర, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగముగా ఆదరణ పథకం - 2ను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల మహాసభలు సెప్టెంబరు 10వ తేదీ లోపల పూర్తి చేసుకోవాలని సెప్టెంబర్ 14, 15 తేదీల్లో రాష్ట్ర మహాసభలు జరపాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర వత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు బెల్లంకొండ బాల వెంకటేశ్వర్లు, బత్తల నాగరాజు, బత్తల రత్తయ్య, మల్లె అశోక్ ,మల్లె నాగార్జున, మల్లె సింహగిరి, విరగ దండ్ల రమణ, తమ్మిశెట్టి నాగ, ఉప్పుడల ఏడుకొండలు, బండి శీను, పి రవిచంద్ర ,బి గంగయ్య ఉన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

వలేటివారిపాలెం :మండలంలోని పోలినే నిపాలెం ఎంపిటిసి చింతలపూడి రవీంద్ర కుమారుడి వివాహ వేడుకలు శుక్రవారం రాత్రి వైభవంగా జరిగాయి. పలువురు ప్రముఖులు నూతన వధూవరులు చింతలపూడి మనోజ్ - శాంతిలను ఆశీర్వదించారు. ఎంఎల్‌సి పోలినేని పాలెం గ్రామస్తులు తూమాటి మాధవరావు, మాజీ ఎంఎల్‌ఎలు ఎం మహీధర్ రెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్, టిడిపి నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్, తదితర ప్రముఖులు వధూవరులను ఆశీర్వదించారు. నిర్వాహకులు చింతలపూడి రవీంద్రను ప్రత్యేకంగా అభినందించారు. జెడ్‌పిటిసి ఇంటూరి భారతి, మండల వైసిపి అధ్యక్షులు పరిటాల వీరాస్వామి, రైతు సంఘం నాయకులు అనుమోలు లక్ష్మీనరసింహం, కందుకూరు నియోజకవర్గం, పరిసర ప్రాంతాలనుండి పలువురు సర్పంచ్ లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు.



మనోజ్‌ను ఆశీర్వదిస్తున్న 'మానుగుంట'

అజ్మీర్‌లో ప్రత్యేక ప్రార్థనలు

నెల్లూరు :రాజస్థాన్ లోని అజ్మీర్ నగరంలోని హాజరత్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో రూరల్ మైనారిటీ నాయకులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా మైనారిటీ నాయకులు ఆ దర్గాలో చాదర్‌ను సమర్పించారు .టిడిపి మైనారిటీ నాయకులు షేక్ ఆసిఫ్ బాషా ఆధ్వర్యంలో జరిగాయి. షేక్ షం షుద్దీన్, షేక్ జీలని బాషా, షేక్ ఖాదర్ , షేక్ మస్తాన్, షేక్ జవీద్,మాజీద్ ఉన్నారు.

అదాని ఫౌండేషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :కృష్ణపట్నం పోర్టులో శనివారం అదాని ఫౌండేషన్ 28వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆదా ని కష్ణపట్నం పోర్టు సిఇఒ జిజె రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వి జనరీ బిజినెస్ లీడర్లు గౌతమ్ భాయ్, అదాని ఫౌండేషన్ చైర్‌పర్సన్ డా.ప్రీతిజి అదానిలని అభివర్ణించారు. వారి నేతృత్వంలో కృష్ణపట్నం సైట్‌లో భాగస్వామ్య కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లను అమలు చేస్తున్నామన్నారు. విద్య, ఆరోగ్యం, గ్రామ పరిశు భ్రత, మహిళా సాధికారత, సహజ వ్యవసాయం, కమ్యూనిటీ ప్లాంటేషన్ అదాని కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ పరిసర గ్రామాలలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తుం దన్నారు. అదాని ఫౌండేషన్ కమ్యూనిటీ ప్రభుత్వ భాగస్వామ్యంతో పనిచేస్తుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ముత్తుకూరు, కృష్ణపట్నం, ఉన్నత పాఠశాలల్లో విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, తాగునీరు, గ్రామ పరిశుభ్రత, మహిళా సాధికారత, కమ్యూనిటీ ప్లాంటేషన్ అభివృద్ధిలో కీలకమైన అంశాలను అదాని ఫౌండేషన్ సిఎస్ఆర్ ప్రాజెక్టులను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదాని కృష్ణపట్నం పో ర్టు పరిధిలోని పరిధిలోని 19 మత్స్యకారుల సంఘాల తోపాటు 32 గ్రామాల్లో అదాని ఫౌండేషన్ పనిచేస్తోందని తెలిపారు. ఆదాని వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో 300 మందికిపైగా యు వకులు, మహిళలు, పిల్లలు అత్యంత ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా విద్యా ర్థు లు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆదాని కృష్ణపట్నం పోర్టు సిఓఓ రాజన్ బాబు, ఆదాని ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్, గణేష్ శర్మ, జి వేణుగోపాల్, ముత్యం జయరామ్, వెంకటేష్ భాస్కరన్, రమేష్ బాబు, జె శ్రీనివాసులు, సిరియాల సత్యనారాయణ, సరళ, ఉమా, ఫౌండేషన్ ప్రతినిధు లు, పోర్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఇఒ జిజెరావు

ముగిసిన శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-గుడ్లూరు :గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. ఘన చెత్త వినియోగం నిర్వహణ, ఎల్ఈడి బల్బులు ఉపయోగం, ఖర్చులు ఆదాయ వనరులపై రెండు రోజులపాటు జరిగిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. డిజిటల్ పంచాయితీ అధికారి కే కష్ణమోహన్ , డిప్యూటీ డైరెక్టర్ జయ రామనాథం, జిల్లా ట్రైనింగ్ సెంటర్ మేనేజర్ వై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు :గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మూడ్రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. వివిధ శాఖలకు సంబం ధించిన మండల స్థాయి అధికారులు ఈ మూడు రోజులపాటు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వ విధి విధానాలను, లక్ష్యాలను తెలియజేశార ఎంపీడీఓ బాలాజీ, పంచాయతీ విస్తరణ అధికారి గీతాలలిత కుమారి, రిసోర్స్ పర్సన్స్ అజీజ్, గ్రంధి వెంకటేశ్వర్లు, నంద్యాల శ్రీనివా సులు రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ మహాసభలు

నెల్లూరు :రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొంటున్న పరిస్థితుల్లో ప్రతిఒక్కరు కలికట్టుగా పనిచేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం నగరంలోని టౌన్‌హాల్‌లో ఎపిటిఎఫ్ ఓక్ జూబ్లీ, విద్యా వైజ్ఞానిక జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభలకు ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సురేంద్రరెడ్డి అధ్యక్షత వహించారు. పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడతూ గతంలో జరిగిన లోపాలను సరిచేసుకుంటూ విద్యారం గాన్ని పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ విషయంలో ఉపాధ్యాయ సంఘం ఏపిటిఎఫ్ కలిసి రావాలని సూచించారు. పాఠశాల విద్యాశాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం , విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఎస్.విజయభాస్కరరావు, ఏపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు, ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవిమాట్లాడారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర, జిల్లా బాధ్యులు రియాజ్, పిచ్చిబాబు, క్రిష్ణారెడ్డి, జుల్సికర్ ఆలీ, శివకోటారెడ్డి, కోటేశ్వరరావు, తిరుపతిరెడ్డి, సుధాకర్‌రావు, బాలత్రిపురసుందరి పాల్గొన్నారు.

పలుచోట్ల యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు



లింగసముద్రంలో జెండావిష్కరణ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు


ప్రజాశక్తి - లింగసముద్రం :యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా లింగసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో లింగసముద్రంలోని కోటయ్య సమాధి సెంటర్ లో శనివారం సీనియర్ కామ్రేడ్ కూరపాటి రమేష్ యు.టి.ఎఫ్ పతాకాన్ని ఎగురవేశారు. యు.టి.ఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ 1974 ఆగస్టు 10న ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి ఈ రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమంలో అగ్రగామి సంఘంగా ఎదిగిందన్నారు. ఉపాధ్యాయ విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటి ఎఫ్ మండల శాఖ అధ్యక్ష,కార్యదర్శులు టి.సరోజినీ, టి.సుధాకర్ రావు, ప్రధానోపాధ్యాయులు యు. మాధవరావు, కె.సూర్య ప్రకాష్ రావు,సీనియర్ కార్యకర్తలు కె.వి.ఎస్. ఆర్.పద్మ కిషోర్,ఎం.ఎం సుధాకర్ రావు,కె ప్రభాకర్,ఐ.ఎల్ నారాయణ, డి మాధవరావు, ఎ. సాంబయ్య, ఎస్. శాంతకుమారి, మరో 30 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

కందుకూరు :యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా కందుకూరు దాచూరి రామిరెడ్డి విజ్ఞాన్ భవన్ (యూటీఎఫ్ ఆఫీస్) వద్ద యుటియఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు ముప్పరాజు కోటేశ్వరావు శనివారం ఎగురు వేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చరిత్ర సంక్షోభాల నుంచి కొత్త శక్తులు ఉద్భవిస్తాయని ఆ క్రమంలోనే 1969 -74 మధ్య ఉపాధ్యాయ ఉద్యమంలో ఏర్పడిన సంక్షోభం నుంచి యుటిఎఫ్ అవతరించిందన్నారు. ఆనాటి నుంచి రాష్ట్ర ఉపాధ్యాయ ఉద్యమంలో అగ్రగామి సంఘంగా ఎదిగి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసి విజయాలు సాధిం చిందన్నారు. మండల శాఖల అధ్యక్ష కార్యదర్శులు, సీనియర్లు,జిల్లా కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, ఎం. మాధవరావు, ఎం.హనుమం తరావు, జి.మాధవరావు,ఎస్. శాంత కుమారి ఓ.వి. రమణయ్య, ఎం. కొండయ్య,జి.సతీష్, జి. శ్రీనివాసులు 50 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.



కందుకూరులో..

గుడ్లూరు : యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక విద్యా వనరుల కేంద్రంలో కావలి రోటరీ క్లబ్ వారి సహకారంతో రక్తదాన శిబిరం శనివారం విజయ వంతంగా నిర్వహించారు. 43 మంది దాతలు రక్తదానం చేశారు. యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినో త్సవం సందర్భంగా ఎంఇఒ 2 గోవర్ధన్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభిం చారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయ ుకులు ముప్పరాజు కోటేశ్వరరావు పాల్గొని ప్రసం గించారు.మండల యుటిఎఫ్ కార్యదర్శిరమేష్, 60 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుడ్లూరులో రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు : ఆ క ֹలి తో ఉన్న వారి వద్దకే ఆహారాన్ని అందిస్తూ నిరంతరం పేదవారి ఆకలిని తీర్చే దిశగా శ్రీరామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా శనివారం మీనిగ సురేష్ బాబు, మాధవి దంపతుల పెద్ద మనవరాలు ,మాచవరం ప్రవీణ్ కుమార్, లావణ్య దంపతుల కుమార్తె మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా పట్టణం లోని పేదుల, నిరాశ్రయులకు మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. శ్రీరామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు మాట్లాడారు. దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కావాటి శ్రీనుకు సన్మానం



ప్రజాశక్తి-బిట్రగుంట : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ భవన్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి కావాటి శ్రీనివాసులును జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పరిమళ శాలువా కప్పి జ్ఞాపికను అదజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కావాటి శ్రీనివాసులు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాలకులు ఎందరు మారిన గిరిజన బ్రతుకుల్లో మార్పు రాలేదని, ఇందిరా గాంధీ పాలనలో గిరిజనులకు వందల ఎకరాలు పంపిణీ చేసి సాగుకు అవసరమైన పరికరాలను ఉచితంగా అందజేసిందని తెలిపారు. ఇప్పుడున్న పాలకులు ఆ భూములను లాక్కొని గ్రావెల్ తవ్వకాలు జరుపుకొని కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన కార్పొరేషన్‌లో ఒక్క రూపాయి కూడా ఉంచకుండా కార్పొరేషన్‌కు వచ్చే నిధులను పక్కదోవ పట్టిస్తున్నారని తెలిపారు. బోగోలు మండలం కప్పరాళ్ల తిప్ప గ్రామం జాతీయ రహదారి ప్రక్కన ఏర్పాటు చేసిన గిరిజన శిక్షణ భవనం కట్టి మూడు సంవత్సరాలైనా ఇంతవరకు ప్రారంభోత్సవానికి నోచుకోలేదని, గిరిజన శిక్షణ భవనానికి చుట్టుపక్కల గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని, కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వమైనా గిరిజన అభివృద్ధికి సహకరించాలని తెలిపారు.

ఎంపిడిఒగా మధుసూదన్ రావు

ప్రజాశక్తి-అనంతసాగరం : అనంతసాగరం మండల ఎంపిడిఒగా ఆనంగి మధుసూదన్ రావు నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపిడిఒ మధుసూదన్ రావు సాధారణ ఎన్నికల్లో నేపథ్యంలో చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రస్తుత విధులు నిర్వహిస్తున్న తాజ్ మస్రూర్ చిత్తూరుకు బదిలీ అయ్యారు. ఎంపిడిఒ మధుసూదన్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఆర్థికసాయం అందజేత



ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని పడమటి కంభంపాడు గ్రామంలో శుక్రవారం కొరివి తిరుపాల్ తండ్రి నరసయ్య అకాల మరణంతో మృతి చెందారు. ఆ నిరుపేద కుటుంబానికి మేమున్నామంటూ కత్తి చిన్నయ్య, ఎస్.మల్లేష్, ఉదయగిరి నరసింహులు, మల్లెం కొండయ్య, ఈశ్వరయ్య, కత్తి సురేష్, కత్తి పెంచలయ్య, రాయుడు పికెపాడు యువత ముందుకు వచ్చింది. రూ.17వేల నగదు గ్రామ పెద్దల సమక్షంలో సహాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి-అనంతసాగరం : తహశీల్దారుగా బాధ్యతలు చేపట్టిన కె.వీర వసంతరావును టిడిపి నాయకులు శనివారం సన్మానించారు. నాయకలు రాపూరు జనార్ధన్ రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు చల్లా నర్సారెడ్డి, యుటిఎఫ్ మండల అధ్యక్షులు వద్దిబోయిన వెంకటేశ్వర్ల రెడ్డి, యుటిఎఫ్ నాయకులు షేక్ వలీ అహ్మద్, నాయకులు కొండా శ్రీనివాసులు రెడ్డి, గౌడ సంఘం నాయకులు క్రోసూరు కామేశ్వరరావు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఆలయాన్ని శుభ్రంగా ఉంచండి..

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం బిలకూట క్షేత్ర శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం పరిసర ప్రాంతాల్లో వేస్టేజ్ పేపర్లు చెత్తాచెదారం ఎక్కువగా ఉన్న ఆలయ కార్యనిర్వహణ అధికారి వాటిపై శ్రద్ధ చూపటం లేదని భక్తులు వాపోతున్నారు. ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో పెళ్లిళ్ల సీజన్ కావడంతో పెళ్లిళ్లు ఎక్కువగా జరుగుతుంటాయి. పెళ్లి అనంతరం వాళ్లు తిన్న ఆకులు ఆలయం చుట్టుపక్కల ప్రాంతాల్లో వేయడంతో కోతులు వాటిని చెల్లాచెదురుగా పడేస్తున్నారని, దానిపై ఆలయ కార్య నిర్వహణ అధికారి దృష్టికి తీసుకుని వెళ్లిన ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని భక్తులు వాపోతున్నారు. తిరుమల తిరుపతి తర్వాత రెండవ తిరుపతిగా పెరగబడిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు, పాలక మండలి సభ్యులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి : సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో కావలి పట్టణం వాయినందన ప్రెస్‌రోడ్డులో నివాసం ఉంటున్న కె.సాయి సునీల్, వారి అక్కయ్య కె.సుష్మ పుట్టినరోజు సందర్భంగా శనివారం బుడంగుంట నక్కలోళ్ల కాలనీలోని పేదలకు భోజన ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ సుష్మ పుట్టినరోజు సందర్భంగా సంస్థ ద్వారా పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేయించిన దాత సాయి సునీల్‌కు ధన్యవాదాలు తెలుపుతూ ఉన్నామని తెలిపారు.

16న లక్ష కుంకుమార్చన

ప్రజాశక్తి-కావలి : వరలక్ష్మీవ్రతం సందర్భంగా మండలంలోని రాజువారి చింతలపాలెంలో 16న శుక్రవారం వైభవంగా నిర్వహిస్తున్న లక్ష కుంకుమార్చన పూజలకు భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని పద్మ వీరబ్రహ్మయ్య స్వామి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని జర్నలిస్టు క్లబ్‌లో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. శ్రావణ మాసంలో విశిష్టంగా జరుపుకునే వరలక్ష్మి వ్రతం అని అన్నారు. అయితే గత 30యేళ్లుగా కావలి మండలం రాజువారి చింతలపాలెంలో విజయదుర్గ ఆశ్రమ పీఠంలో లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నామని దానిలో భాగంగా ఈ సంవత్సరం కూడా లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పూజలకు కావలి పట్టణం, చుట్టుపక్కల ప్రాంత భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ విశిష్ట అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు అందరికీ ఇవ్వబడునని తెలిపారు. ఈ కార్యక్రమానికి కావలి ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి కూడా హాజరౌతున్నారని తెలిపారు. ఆయన విజయదుర్గ ఆశ్రమపీఠం నిర్మించే దగ్గర నుంచి ఆయన సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. విజయదుర్గ ఆశ్రమ పీఠం ఆలయ చైర్మన్ వేమల చెన్నకేశవ నాయుడు ఆయన సహాయ సహకారాలు అందిస్తూ కుంకుమార్చన పూజలలో పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ట్రెజరర్ చంద్రమౌళి, భక్తులు రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమం పరిశీలన



ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ఎఎస్‌పేట ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఎపి ఎస్‌ఐఆర్‌డి రాష్ట్ర అబ్జర్వర్ రాజ్యలక్ష్మి తెలియజేశారు. గత పరిపాలన కంటే గ్రామ పంచాయతీలు ఇంకా మంచి పరిపాలన అందించాలని మూడు రోజుల నుంచి రీ ప్రెష్‌మెంట్ శిక్షణ ఇస్తున్నామని ఆమె తెలిపారు. శిక్షణలో పాల్గొన్న ఇన్‌చార్జి మండల అభివృద్ధి అధికారి సి.శ్రీనివాసులు తదుపరి అందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ పంచాయతీ అధికారి డి. నారాయణ, శిక్షణ నిర్వహకులు పి. భరత్, షేక్. ఎన్నారి బాషా, ఎస్.ప్రతాప్, ఎం.సి.ఒ. ప్రసన్న కుమారి, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ఉదయగిరిలో..

ప్రజాశక్తి-ఉదయగిరి

ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉదయగిరి మండలశాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక పుల్లంపల్లి సుందరయ్య భవనంలో పతాకావిష్కరణ చేసి కేక్ కటింగ్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల సాధనే యుటిఎఫ్ లక్ష్యం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రమాదకరంగా మారిన 117 జిఒను వెంటనే రద్దు చేయాలని, పాఠశాలల వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే యుటిఎఫ్ అధ్యక్షులు హనీఫ్ మాట్లాడుతూ ఆర్థికంగా చాలా నష్టపోయిన ఉద్యోగులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని కొత్తగా ఏర్పాటైనా ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో దస్తగిరి అహ్మద్, ఫణికుమార్, నాగేశ్వరరావు, ఖాదర్ బాషా, దావుద్, యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీతారామపురంలో..

ప్రజాశక్తి-సీతారామపురం : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీతారామపురం మండల శాఖ ఆధ్వర్యంలో ఎపి యుటిఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సీతారామపురం బస్టాండ్ సెంటర్ వద్ద యుటిఎఫ్ కార్యాలయం ఎదురుగా యుటిఎఫ్ పతకావిష్కరణ, కేక్ కటింగ్ కార్యక్రమాలను మండల యుటిఎఫ్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1974 ఆగస్టు 10వ తేదీన యుటిఎఫ్ ఆవిర్భవించి ఇప్పటికి 50 సంవత్సరాలు పూర్తయిందని కాబట్టి యుటిఎఫ్ కార్యాలయంలో స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించమన్నారు. ఈ సందర్భంగా జిఒ నెంబర్ 117ను రద్దు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎదమ తిరుపతయ్య, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గొడ్లవీటి వెంకటేశ్వర్లు, పేరాల శ్రీనివాసులు, మహేష్, వెంకటేశ్వర్లు, అన్నంగి ప్రసాద్, కె.పవిత్ర కుమారి, విజయ్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, తదితర యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



కావలిలో..

ప్రజాశక్తి-కావలి : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) 50వ ఆవిర్భావ దినోత్సవం కావలిలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు (1974-2024) సందర్భంగా కావలి ప్రాంతీయ మండల శాఖ కార్యాలయంలో యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు బి.శ్రీదేవి, జిల్లా కార్యదర్శి బి.మాధవరావు, విశ్రాంత యుటిఎఫ్ నాయకులు ఆకుల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.



మర్రిపాడులో..

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక యుటిఎఫ్ భవన్‌లో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్ యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కుటుంబ సంక్షేమ డైరెక్టర్ ఎస్.కె.నాయబ్ మాట్లాడుతూ యుటిఎఫ్ 50యేళ్లు పూర్తి చేసుకుని 51వ వసంతంలోకి అడుగుపెట్టా మన్నారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తూ విద్యారంగ సమస్యల కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. అనంతరం స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు పి.గురుస్వామి, కె.బాల గురవయ్య, ఎన్ వెంకటేశ్వర్లు, జి వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు సుధాకర్, మహమ్మద్ గౌస్, భవన నిర్మాణ కార్యదర్శి జాన్సన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోవూరులో పండ్లు వితరణ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కోవూరు : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 50 వసంతాలు పూర్తిచేసుకుని ఉత్సవాలు జరుపుకుంటున్నది ఈ సందర్భంగా కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల ఆధ్వర్యంలో కోవూరు మంద బయలుసెంటరులో పతాకావిష్కరణ జరిపారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి కోవూరు ఏరియా ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్‌లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఖాజావలి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో యుటిఎఫ్ మేటి సంఘం అని 50 సంవత్సరాల ప్రస్థానంలో రీ గ్రూపింగ్ స్కేల్, అప్రెంటిస్ విధానం రద్దు మొదలగు పెద్ద సమస్యలను పరిష్కరించడంలో సఫలమైందని తెలియజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి భారతి, ప్రాంతీయ మండలాల నాయకులు తిరుపాలు, మాలకొండయ్య, రవిచంద్ర, రమేష్, వెంకటేశ్వర్లు సుబ్బారావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, నాగభూషణం, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

'తుర్లపాటి' జయంతి

ప్రజాశక్తి-కావలి

తెలుగు పాత్రికేయ దిగ్గజం తుర్లపాటి కుటుంబరావు అని లోక్‌సత్తా ఉద్యమనేత మాలకొండా రెడ్డి తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు పాత్రికేయ వృత్తిలో 75 సంవత్సరాలు జీవించిన పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు పాత్రికేయులకు ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. తుర్లపాటి కుటుంబరావు జయంతి సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ పాత్రికేయ రంగంలో 75 సంవత్సరాలు రాణించి అనేకమంది జర్నలిస్టులకు ఆదర్శప్రాయంగా ఆ వృత్తికి వన్నె తెచ్చినారని తెలిపారు. కృష్ణాజిల్లా విజయవాడలో జన్మించిన తుర్లపాటి కుటుంబరావు దేశంలో ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు, సినీ ప్రముఖులు, ఎంతోమంది జీవిత చరిత్రలను వారి త్యాగాలను పత్రికల ద్వారా వ్యాసాలు రాసి, ప్రజలను మేల్కొల్పిన గొప్ప పాత్రికేయుడని తెలిపారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని అందజేశారని తెలిపారు. నేటి యువజర్నలిస్టులు, పాత్రికేయులు, వారిని స్ఫూర్తిగా తీసుకొని, సమాజ శ్రేయస్సు కోసం పాత్రికేయ వృత్తికి వన్నె తేవాలన్నారు.

కాలువను కప్పేసి నిర్మాణాలు



ప్రజాశక్తి - బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి పట్టణంలో రోజు రోజుకూ ఆక్రమణలు ఎక్కువ అవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం రేబాల కాలువ ఆనించి పార్క్ కాంప్లెక్స్ వద్ద కొందరు అక్రమంగా దుకాణాలను ఏర్పాటు చేసి విలువైన నగర పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తున్నారు. దాదాపు నగరంలోని అన్ని కాలువలను ఆక్రమించి నిర్మాణాలు సాగించి ఉన్నారు. అధికారులకు పట్టడం లేదు. అక్రమార్కులు చేయి తడపడంతో లీజులు సృష్టించి సంవత్సరాల తరబడి రూపాయి కట్టకుండా స్వేచ్ఛగా ఆక్రమించి షాపులు నిర్వహిస్తున్నారు.నగరంలో అక్రమ కట్టడాలు పట్ల అధికారులు చూసీచూడనట్టు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నా యి. పాలకులు కూడా అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు మిన్న కుండిపోతున్నారు. దీంతో ఆక్రమణలకు అదుపు లేకుండా పోతుంది. అధికారులు తప్పించుకునేందుకు అక్రమార్కుల వద్ద ఆక్రమణల పన్ను అంటూ వసూలు చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఇప్పటికైనా ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై కమిషనర్ రమణబాబు వద్ద ప్రస్తావించగా టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌ను పరిశీలనకు పంపించినట్లు చెప్పారు.త్వరలోనే బుచ్చి నగర పంచాయతీ ఆక్రమలు గుర్తించి తొలిగించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.



ముగిసిన సర్పంచ్, కార్యదర్శుల శిక్షణ

ప్రజాశక్తి-అనంతసాగరం

స్థానిక మండల కేంద్రంలో మండల కాన్ఫరెన్స్ హాల్లో 8వ తేదీ నుంచి ప్రారంభమైన గ్రామసర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. శిక్షణ తరగతులు పరిపాలన అధికారి మస్తాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామాలలో వీధి దీపాలు, మురికి కాలువలు, మౌలిక వసతులపై గ్రామ సర్పంచులు, కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మండల పరిషత్ విస్తరణ అధికారి డి.రమేష్, పంచాయతీ కార్యదర్శులు జునైద్ అహ్మద్, ఎన్.పుల్లయ్య, మోహన్ కిషోర్, పవన్, శ్రావణి, మోహన్, రమణరావు, గ్రామ సర్పంచులు కె.లక్ష్మీదేవి, బుజ్జమ్మ, లక్ష్మమ్మ, చలంశెట్టి పెంచలయ్య పాల్గొన్నారు.

రైతుల బాగోగులు పట్టించుకోండి..!

- జెడ్‌పి సమావేశంలో ఎంఎల్‌ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి

వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే రైతులకు అవసరమైన విత్తనాలు సకాలంలో అందించి రైతుల బాగోగులు పట్టించుకోవాలని ఎంఎల్‌ఎ దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కోరారు. శనివారం నెల్లూరులో జరిగిన జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దగదర్తి, బోగోలు మండలాలలో విత్తన కొరతను తీర్చాలన్నారు. సోమశిల జలాల కేటాయింపులో జలదంకి, కావలి, బోగోలు, దగదర్తి మండలాలకు నీటి కేటాయింపులు పెంచాలన్నారు. నియోజకవర్గంలో కాలువల పూడిక గత ఐదేళ్లలో చేపట్ట లేదని వెంటనే చేపట్టి సాగునీరు అందేలా చూడాలన్నారు. నీటి కేటాయింపుల విషయంలో కొంత అన్యాయం జరుగుతుందని, అందుకే డెల్టా, నాన్ డెల్టాపై రీసర్వే చేపట్టాలన్నారు. నాటి పొలాలు నేడు నివాసయోగ్యమైన ప్రాంతాలుగా మారిపోయాయన్నారు. కొబ్బరి చెట్ల పెంపకంలో రైతులకు అవగాహన కలిగించాలన్నారు. హార్టికల్చర్ అధికారులు దానిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గోదావరి జిల్లాలో రైతులు ప్రధాన ఆదాయ వనరు కొబ్బరి పంట అని తెలిపారు.



ఉద్యాన పంటలపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-అనంతసాగరం

అనంతసాగరం, గౌరవరం గ్రామాలలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో శాస్త్రవేత్త నారాయణ స్వామి రైతులకు మిర్చి, బొప్పాయి, నిమ్మ పంటలలో వేరు కుళ్ళు తెగుళ్ళు, వైరస్, రసం పిల్చే పురుగుల నివారణ చర్యలు గూర్చి అవగాహన కల్పించారు. మిర్చి, బొప్పాయి పంటలలో రసం పీల్చే పురుగులు నివారణకు పసుపు, తెలుపు, బులుగు రంగు అట్టలు ఎకరాకి 30 పెట్టుకోవాలని తెలియజేశారు. వేరు కుళ్ళు తెగులుకు సంబంధించి ట్రైకోడెర్మా జీవనఎరువులు వాడుకోవాలని తెలియజేశారు. నిమ్మలో పూత యాజమాన్యం కోసం జులైలో జిబ్బర్లిక్ యాసిడ్ 50 పిపిఎం 1 గ్రాము 20 లీటర్ల నీటికి, సెప్టెంబర్ మాసంలో సైకోసిల్ 1000 పిపిఎం 1 మి.లి 1 లీటర్ నీటికి, అక్టోబర్‌లో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటర్ నీటికి స్ప్రే చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి రాజశేఖర్, ఉద్యానవన శాఖకు సంబంధించిన పథకాలు, రాయితీలు గురించి వివరించారు, డ్రిప్పు, స్ప్రింక్లర్ల పథకం రాయితీలు తెలియజేస్తూ రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అనంతసాగరం గ్రామ వ్యవసాయ సహాయకులు వి.యశోద, గ్రామ ఉద్యానవన సహాయకులు మైమున్నిసా, రైతులు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి-అనంతసాగరం : ఎంపిడిఒ తాజ్ మస్రూర్ చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తూ ఎన్నికల నిర్వహణలో భాగంగా మండలంకు బదిలీ అయ్యారు. ఆరు నెలలుగా ఎంపిడిఒగా విధులు నిర్వహించి తిరిగి కుప్పంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల కార్యాలయ సిబ్బంది ఆయన్ను సన్మానిం చారు. తనకు సహకరించిన ప్రతి మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు ధన్యవాదాలు తెలిపారు.

ఎపి జెన్కోలో తెగిన యాష్‌పాండ్ కట్ట

ప్రజాశక్తి-నెల్లూరు

ఒకపక్క నేలటూరు ప్రాంతంలో దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్తు కేంద్రం (ఎపి జెన్కో)కు సంబంధించిన యాష్‌పాండ్ కట్ట తెగిపోయి రసాయనంతో కూడిన బూడిద మొత్తం పంటపోలాల్లో నిండిపోయిన రైతాంగానికి, మత్స్యకారులకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేయాలంటూ నిత్యం నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో 12వ తేదీన ఎపి జెన్కో ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టేందుకు సైతం కార్మిక సంఘాలు సిద్ధం అవుతున్నాయి. ఈ మేరకు జిల్లా అధికారులకు కార్మిక సంఘాలు నోటీసులు సైతం అందజేశారు. ఉద్యోగ, కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేయడమే కాదు.. ప్రకృతి కన్నెర్ర చేసి సృష్టించిన విధ్వంసంలో సర్వస్వం కోల్పోయి, కుటుంబ సభ్యులను కోల్పోయి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్న బాధితులను సైతం ఆదుకొనేందుకు తమవంతు సహాయం చేస్తామంటూ సిపిఎం శ్రేణుల అడుగులు ముందుకు వేశాయి. ఎక్కడికక్కడే సిపిఎం శాఖలు ప్రతినిత్యం విరాళాల సేకరణ చేసి చేతికి వచ్చిన నగదును రాష్ట్ర కమిటీకి అందజేసి తద్వారా కేరళ రాష్ట్రానికి చెందిన వయనాడ్ ప్రాంత బాధితులకు అందజేసే పనిలో నిమగ్నమైపోయారు. నాడు-నేడు పనులు నాశిరకంగా నిర్వహించిన కారణంగా సన్‌సైడ్ పైన పడి 9వ తరగతి విద్యార్థి మృతి చెందడం అందరికీ తెలిసిందే. అయితే ఈ మృతికి ఎవరు కారణమో విచారణ చేసి నివేదిక అందజేయాలని ఒక కమిటీని జిల్లా అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కమిటీ విచారణ చేసి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు. నివేదికను అనుసరించి విద్యార్థి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటే సరిపోదని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అధ్యాపకుల నియామకం ప్రభుత్వం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మంచి గుర్తింపు తీసుకొస్తున్న పాఠశాలల్లో విద్యార్థులను చేర్పు కోవాలంటూ అధికారులు, రాజకీయ నాయకులు సిఫార్సు చేయడంతోపాటు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధన చేసేందుకు అవసరమైన సిబ్బందిని సైతం నియమించడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ దిశగా జిల్లా అధికారులు, రాజకీయ నాయకులు ఆలోచన చేస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ఎంతో దోహదపడుతుంది. ఉపాధ్యాయ సంఘాలు యుటిఎఫ్, ఎపిటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు నగరంలో పోటాపోటీగా నిర్వహించాయి. యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం నగరంలో ర్యాలీ నిర్వహించి తన ఆధిక్యతను చాటు కొనేందుకు ప్రయత్నించింది. నగరంలో జిల్లా అధికారుల సంతకాల ఫోర్జరీ వ్యవహారాలు కలకలం సృష్టిస్తున్నాయి. నిన్నటి వరకు కార్పొరేషన్‌లో ఒక ఐఎఎస్ అధికారి సంతకాన్ని కొందరు వ్యక్తులు ఫోర్జరీ చేసే కోట్లాది రూపాయలు దోచుకొని తమ జేబులు నింపుకున్నారు. చివరకు ఆ అవినీతి అక్రమం బహిర్గతం కావడంతో అప్పటి కార్పొరేషన్ కమిషనర్ హుటాహుటిన ఎస్‌పి కార్యాలయానికి చేరుకొని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసు కేసు నమోదు చేయాలని, కారణమైన వారిని కఠినంగా శిక్షించాలంటూ ప్రజా సంఘాలు ఆందోళన చేయడంతో స్పందిం చిన పోలీసులు విచారణ ప్రారంభిం చారు. ఇదిలా ఉంటే జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఏకంగా డిఎంహెచ్ఒ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఉద్యోగ నియామకాలు చేస్తున్న ఘనుడి వ్యవహారం బహిర్గతం అయింది. దానిపై స్పందించిన డిఎంహెచ్ఒ తమ కార్యాలయ పరిధిలోని పోలీసు స్టేషన్‌కు చేరుకోని తన సంతకాన్ని కొందరు ఫోర్జరీ చేసి ఉద్యోగ నియామకపు ఉత్తర్వులు (నకిలీ) పంపిణీ చేస్తున్నారని, నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడుతున్నారని విచారణ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

వీక్షణం

సచివాలయాలపై పర్యవేక్షణ కరువు

- పన్ను వసూలు శూన్యం
- అభివృద్ధికి దూరమవుతున్న గ్రామాలు

ప్రజాశక్తి-ఉదయగిరి

వెనుకబడిన మెట్ట మండలంలోని సచివాలయాల్లో జరిగే పనితీరుపై జిల్లా ఉన్నత అధికారులు పర్యవేక్షణ కరువడంతో గ్రామాలలో అభివృద్ధి పనులు దూరం అవుతున్నాయని పలు పంచాయతీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 12 సచివాలయాలు ఉండగా కొన్ని సచివాలయాలకు ఒకే వ్యక్తి డిడిఒగా వ్యవహరించడంపై ఆయా పంచాయతీలోని ప్రజలు గ్రామాలలో జరగని పనులపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని సచివాలయాలకు డిడిఒలు లేక ఉన్న పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించక పోవడంతో మరింతగా సిబ్బందితోపాటు సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా తిరుమలాపురం గ్రామ పంచాయతీలో ఇంటి పన్నులు వసూలు చేసిన దాఖలాలు లేక అభివృద్ధి కుంటిబడి పోతుందని సర్పంచ్ కొల్లిబోయిన సంజయ్ కృష్ణయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. పన్నులు వసూలు చేయక గ్రామ పంచాయతీలో నిధులు లేక అభివృద్ధి పనులకు జరగలేనట్టు పంచాయతీ కార్యదర్శిగా 6మందిని మండల అధికారులు మార్చారని ఇంత జరుగుతున్న మండలస్థాయి అధికారులు పట్టించుకోవడంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోతామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామ పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి లేక అభివృద్ధి కుంటు పడిందని, ఇకనైనా అధికారులు తీరు మార్చుకొని కార్యదర్శిని నియమించి పంచాయతీ అభివృద్ధి గురించి ఆలోచించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. తీరు మారకపోతే పంచాయతీ ప్రజల కోసం ఈ విషయాన్ని డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లేందుకు వెనుకాడబోమని ఆవేదనపై సంబంధిత జిల్లా అధికారులు వెంటనే చర్యలు చేపట్టి సచివాలయ పనితీరు సచావుగా జరిగేందుకు ఆయా సచివాలయాలకు కార్యదర్శులను నియమించి బాధ్యతలు అప్పగించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

